# సాక్షి పెద్దపల్లి

శుక్రవారం । 28 । జూన్ । 2024




## సన్మానం

గోదావరిఖనిటౌన్: గోదావరిఖని ప్రభుత్వ బాలుర జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ మాధవిని ఇంటర్ బోర్డు డిస్ట్రిక్ట్ ఇన్‌చార్జి ఆఫీసర్‌గా నియమించడంపై గురువారం సన్మానించారు.



## పోచమ్మ బోనాలు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం రాగినేడులో గురువారం పోచమ్మతల్లి బోనాలు ఘనంగా జరుపుకున్నారు. మహిళలు నెత్తిన బోనాలతో ఆలయానికి వెళ్లి మొక్కులు సమర్పించారు.

గరిష్టం/కనిష్టం

31.0/26.0

## వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

## న్యూస్‌రీల్

### గురుకులాలకు టెండర్లు ఖరారు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అరుణశ్రీ

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని మైనార్టీ గురుకుల విద్యాసంస్థలకు ఆహార పదార్థాలు సరఫరా చేసే టెండర్లను గురువారం ఖరారు చేశామని అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ అన్నారు. కలెక్టరేట్‌లో టెండర్‌దారుల సమక్షంలో దాఖలైన టెండర్లను తెరిపించారు. పండ్లు, కూరగాయలు, గుడ్లు, చికెన్, కిరాణసామగ్రి, పాలు సరఫరా కోసం దాఖలైన టెండర్లను ఖరారు చేశామన్నారు. జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి మెహరాజ్ వహమ్మద్, సురేశ్, ప్రిన్సిపాల్ తదితరులున్నారు. అలాగే జిల్లాలోని ఎస్సీ హాస్టళ్లకు అవసరమైన సామగ్రిని సరఫరా చేసేందుకు దాఖలైన టెండర్లను గురువారం తెరిపించారు. అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ టెండర్‌దారుల సమక్షంలో నిత్యావసర సరుకులు, కోడిగుడ్లు, చికెన్, పండ్లు, కూరగాయలు, శానిటేషన్, వాచ్‌మెన్‌కు సంబంధించిన టెండర్లు ఖరారు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ అభివృద్ధి అధికారి నాగలైశ్వర్, శ్రీనివాసరెడ్డి, ప్రేమ్‌కుమార్, మధుసూదనశర్మ తదితరులు పాల్గొన్నారు.

### కార్మిక కుటుంబాల ఆరోగ్య సంరక్షణే ధ్యేయం



మాట్లాడుతున్న ఆర్జీ–2 జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ

గోదావరిఖని(రామగుండం): కార్మిక కుటుంబాల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా సంస్థ సీఎండీ ఎన్.బలరాం ముందుకు సాగుతున్నారని ఆర్జీ–2 జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ పేర్కొన్నారు. గురువారం రామగుండం ఏరియా హాస్పిటల్ ఆధ్వర్యంలో బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి ద్వారా మహిళలకు బ్రెస్ట్ క్యాన్సర్ మెడికల్ క్యాంప్ నిర్వహించారు. జీఎం ముఖ్య అతిథిగా హాజరైన క్యాంపును ప్రారంభించారు. 45 ఏళ్లు దాటిన మహిళా ఉద్యోగులు, కార్మికుల గృహిణులు, మహిళా సభ్యుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా బ్రెస్ట్ క్యాన్సర్ మెడికల్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు వివరించారు. రామగుండం రీజియన్‌లోని మూడు ఏరియాల నుంచి రిజిస్టర్ చేసుకున్న 100మంది మహిళలకు వైద్య పరీక్షలు చేశారు. బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి గైనకాలజిస్టు శ్రవణికుమారి మాట్లాడుతూ, మహిళల వయస్సు పెరుగుతున్న కొద్దీ అధిక బరువు పెరగడం, వ్యాయామం చేయకపోవడం, కొవ్వు పదార్థాలు గల ఆహారం అధికంగా తినడం వల్ల ప్రమాదకర జబ్బులు వస్తాయని వివరించారు. కొన్ని నియమాలు పాటిస్తే బ్రెస్ట్ కాన్సర్ నివారించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్జీ–1 ఇన్‌చార్జి జీఎం బి.సైదులు, ఏరియా ఆసుపత్రి డీవైసీఎంవో కిరణ్‌రాజ్‌కుమార్, మూడు ఏరియాల సేవా అధ్యక్షులు చింతల లక్ష్మి, మాలతి, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

### ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి



సమావేశంలో ఐఎఫ్‌టీయూ నాయకులు

గోదావరిఖని(రామగుండం): సింగరేణి కార్మిక వర్గ ప్రయోజనాల కోసం కార్మిక సంఘాలు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు కె.విశ్వనాథ్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక తిలక్‌నగర్ ఆఫీస్‌లో మాట్లాడారు. విడివిడిగా పోరాటాలు చేయడం వల్ల యాజమాన్యానికి లాభం చేకూరుతుందన్నారు. ఎన్నికల పర్వం మొదలైనప్పటి నుంచి కార్మిక సంఘాల మధ్య అనైక్యత, సింగరేణిలో రాజకీయ జోక్యం అధికంగా పెరిగిపోయిందన్నారు. సాధించుకున్న హక్కులను సైతం కాపాడుకోలేని పరిస్థితి నెలకొందని వాపోయారు. సింగరేణిలో చిన్న, పెద్ద కార్మిక సంఘాలన్నీ బేషజాలు, అధికారం ఆశలకు పోకుండా కార్మిక వర్గ ప్రయోజనాలే లక్ష్యంగా, బొగ్గు బావుల రక్షణే ప్రథమంగా ముందుకు సాగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సింగరేణి రక్షణకు సమరశీల పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు దాముక లచ్చయ్య, ముత్తయ్య రామచందర్, రవీందర్, ఎల్లయ్య భీమయ్య, ఎండీ ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

# ప్రాదేశికల్లో ‘ప్రత్యేక’మేనా..?

- జూలై 4తో ముగియనున్న పదవీకాలం
- నిధులు లేక నిస్తేజంగా మారిన జిల్లా, మండల పరిషత్‌లు
- నేడు జెడ్పీ చివరి సర్వసభ్య సమావేశం



జిల్లా పరిషత్ కార్యాలయం

సాక్షి, పెద్దపల్లి: స్థానిక సంస్థల ఎన్నికలు ఇప్పట్లో జరిగే అవకాశాలు లేకపోవడంతో ఇప్పటికే గ్రామ పంచాయతీలకు ప్రత్యేకాధికారులను నియమించి పరిపాలన కొనసాగిస్తున్నారు. తాజాగా జూలై 4 నుంచి జెడ్పీటీసీలు, 3న మండల పరిషత్‌ల పదవీకాలం ముగియనుండటంతో ప్రాదేశికల్లో సైతం ప్రత్యేకాధికారుల పాలన అమలు చేసేందుకు యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఫిబ్రవరి 2తో సర్పంచ్‌ల పదవీకాలం ముగిసిన సమయంలో తమ పదవీకాలం పొడిగించాలని ప్రభుత్వాన్ని కోరినా.. నూతన పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ఎన్నికలు నిర్వహించాలి లేదా ప్రత్యేకాధికారులను నియమించి పాలన కొనసాగించాల్సి ఉండటంతో ప్రభుత్వం ప్రత్యేకాధికారుల పాలనకే మొగ్గుచూపింది. దీంతో మండల పరిషత్‌ల పదవీకాలం పొడిగించే అవకాశం కనిపించడం లేదు. వీరి పదవీకాలం పొడిగిస్తే తాజా మాజీ సర్పంచుల నుంచి వ్యతిరేకత వ్యక్తమయ్యే పరిస్థితి ఉంటుంది. దీంతో ప్రత్యేకపాలన విధించి, వచ్చే సంవత్సరంలోనే ఎన్నికలు జరిగే అవకాశాలున్నాయి.

**సమావేశాలకే పరిమితం**

సామాజికాభివృద్ధిలో ప్రధాన పాత్ర పోషించే జిల్లా, మండల పరిషత్‌లు నిధులు లేక సమావేశాలకే పరిమితమయ్యాయి. స్థానిక స్వపరిపాలనే లక్ష్యంగా ఐదంచెల పంచాయతీరాజ్ విధానంలో ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు ఉత్సవ విగ్రహాలుగానే మారిపోయారు. కేవలం మండల, జిల్లాపరిషత్ సర్వసభ్య సమావేశాలకు రావడంతోనే సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత ప్రభుత్వం పరిషత్‌లకు ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తామని ఇచ్చిన హామీ కార్యరూపం దాల్చకుండానే శుక్రవారం జెడ్పీ చివరి సమావేశంతో పాలకవర్గం ముగియనుంది. సమావేశాల్లో తీసుకునే నిర్ణయాలు, నిధుల మంజూరుకు సభ్యుల ఆమోదం తప్పనిసరి. అంతకుమించి ప్రాదేశిక సభ్యులకు ఎలాంటి అధికారాలు లేక సలహాలు, సూచనలకే పరిమితమయ్యారు.

**రిజర్వేషన్లపై సందిగ్ధం**

పదేళ్లపాటు రిజర్వేషన్లు ఉండేలా అప్పట్లో కొత్త పంచాయతీరాజ్ చట్టంలో పొందుపర్చారు. 2018లో ఎన్నికలు నిర్వహించిన సమయంలో నిర్దేశించిన రిజర్వేషన్లు పదేళ్లపాటు అమల్లో ఉంటాయని వెల్లడించారు. అధికార ప్రభుత్వం బీసీల రిజర్వేషన్లు పెంచుతామని ఎన్నికల్లో హామీ ఇచ్చింది. బీసీ గణన చేపట్టి ఆయా గణాంకాల ఆధారంగా రిజర్వేషన్లు కల్పిస్తామని తెలిపింది. దీనికితోడు గడిచిన కాలంలో నూతన పంచాయతీల సంఖ్య పెరిగిన నేపథ్యంలో రిజర్వేషన్ల మార్పు తప్పనిసరిగా కనిపిస్తోంది.

### నిధుల్లేవ్.. ప్రాధాన్యం లేదు

ఎన్నికల్లో గెలిచేందుకు చేసిన ఖర్చు లక్షల్లో.. కానీ గత ఐదేళ్లలో వచ్చిన నిధులు అరకొరే. సకాలంలో నిధులు రాక, పనులు లేక ప్రాధాన్యం దక్కక జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు ఉత్సవ విగ్రహాల్లా మిగిలిపోయారు. కనీసం మండలాల్లో జెడ్పీటీసీ సభ్యులకు, ఎంపీటీసీలకు గ్రామాల్లో చివరకు కుర్చీ లేకుండా పోయిందన్న ప్రచారం ఉంది. గతంలో జెడ్పీల ద్వారా గ్రామాలకు నిధులు అందేవి. కానీ 15వ ఆర్థిక సంఘం ద్వారా నిధులు జెడ్పీల ద్వారా కాకుండా నేరుగా జీపీలకు చేరుతుండటంతో పరిషత్తుల ప్రాధాన్యం కోల్పోయింది. ప్రస్తుత విధానంలో ఆర్థిక సంఘం ద్వారా 80శాతం నిధులు జీపీలకు, మండల పరిషత్‌లకు 15శాతం, జిల్లా పరిషత్‌లకు 5శాతం కేటాయింపులవుతున్నాయి. సీనరేజ్ నిధులు సైతం రాకపోవడంతో గతంలో వందల కోట్ల నిధులతో అలలారిన జిల్లా పరిషత్ క్రమంగా నిర్వీర్యమయ్యే స్థితికి చేరుకున్నాయి. కేటాయించిన నిధులతో గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టి తమ ముద్ర వేసుకోవాలని భావించినా, అరకొర నిధులతో సదరు ప్రజాప్రతినిధులు అసంతృప్తితోనే తమ పదవీకాలాన్ని పూర్తిచేశారు.

# పేరు, హోదాతో కూడిన బోర్డు ఉండాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష



వృద్ధులు, వికలాంగుల సంక్షేమశాఖ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లిరూరల్: కలెక్టరేట్‌లోని కార్యాలయాలను గురువారం కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆకస్మికంగా సందర్శించారు. గ్రంథాలయం, భోజనశాల గదులు, రికార్డు గది, పోస్టాఫీస్, ఎన్ఐసీ, క్రచ్ సెంటర్‌తో పాటు పలు కార్యాలయాలను పరిశీలించారు. గ్రంథాలయంలో కంప్యూటర్ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రభుత్వం జారీ చేసే ప్రభుత్వ ఉత్తర్వు కాపీ గ్రంథాలయానికి వచ్చే వారికి అందుబాటులో ఉంచాలన్నారు. ప్రతి కార్యాలయంలోని సెక్షన్ అధికారుల క్యాబిన్ వద్ద ఉద్యోగి పేరు, హోదాతో కూడిన బోర్డు ఏర్పాటు చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట ఏవో శ్రీనివాస్, జిల్లా అధికారులున్నారు.

**పకడ్బందీగా ‘తొలిమెట్టు’**

జిల్లాలో తొలిమెట్టు కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష విద్యాశాఖాధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో సమీక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల విద్యా ప్రమాణాలు పెంపొందాలని, అందుకు ఉపాధ్యాయులు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలన్నారు. జూలై మొదటి వారంలో బేస్‌లైన్ పరీక్ష నిర్వహించాలని, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. రోజూ చదవడం, రాయడం ప్రాక్టీస్ చేయించాలని సూచించారు. డీఈవో మాధవి, పాఠశాల అకాడమిక్ అధికారి పీఎం షేక్, ఎంఈవోలు పాల్గొన్నారు.




ఎస్ఈ విజేందర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జెన్‌కో ఉద్యోగులు

### జెన్‌కో ఆధ్వర్యంలోనే నిర్మించాలి

రామగుండం: రామగుండం నగరంలో సాంకేతిక కారణాలతో మూతపడిన బీ–థర్మల్ విద్యుత్ కేంద్రం స్థానంలో సింగరేణి ఆధ్వర్యంలో 800 మెగావాట్ల సామర్థ్యం గల కొత్త కేంద్రం స్థాపనకు కాంగ్రెస్ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన విషయం తెలిసిందే. కాగా, సింగరేణికి అప్పగించడం విరమించుకొని జెన్‌కో సంస్థకు అప్పగించి అస్తిత్వం కాపాడాలని బీ థర్మల్ ఉద్యోగులు గురువారం సూపరింటెండెంట్ ఇంజినీర్ పి.విజేందర్‌కు వినతిపత్రం అందజేశారు. సింగరేణికి అప్పగించే నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని కోరారు.

### కొత్త చట్టాలపై అవగాహన ఉండాలి

- రామగుండం సీపీ శ్రీనివాస్



ప్రశంసాపత్రం అందజేస్తున్న సీపీ శ్రీనివాస్

గోదావరిఖని(రామగుండం): పోలీసు అధికారులు, సిబ్బందికి కొత్త చట్టాలపై పూర్తి అవగాహన ఉండాలని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ పేర్కొన్నారు. భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్యాఅధినియం–2023పై పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలలోని పోలీస్ అధికారులు, సిబ్బందికి నెల రోజులపాటు నిర్వహించిన శిక్షణ తరగతులు గురువారంతో ముగిశాయి. ఈసందర్భంగా సీపీ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. జూలై 1 నుంచి దేశవ్యాప్తంగా బీఎన్ఎస్, బీఎన్ఎస్ఎస్ చట్టాలు అమలులోకి వస్తాయన్నారు. కొత్త చట్టాలు అమలు జరిగిన వెంటనే ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అన్ని సెక్షన్లపై పూర్తి అవగాహన అవసరమన్నారు. నూతన చట్టాలతో కేసుల దర్యాప్తు, విధి విధానాలు, విచారణ పద్ధతుల్లో మార్పు వస్తుందని, ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించేందుకు వీలుంటుందన్నారు. అందరికీ అర్థమయ్యేలా తరగతులు బోధించిన ఏసీపీ మల్లారెడ్డి, రామగుండం ట్రాఫిక్ సీఐ రాజేంద్రప్రసాద్, ఎస్ఐలు రాజేశ్, వినీత, సంతోష్, హెడ్ కానిస్టేబుల్ పి.వంశీకృష్ణ, బి.శ్రీనివాస్, కె.రాము, సంతోష్, శ్రీనివాస్, కానిస్టేబుల్ తిరుపతి, ఎన్.శ్రీనివాస్‌కు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు పాల్గొన్నారు.

# సమీక్షిస్తూ.. దిశానిర్దేశం చేస్తూ

- విజిట్స్, తనిఖీలతో యంత్రాంగాన్ని పరుగులు పెట్టిస్తూ
- విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే సస్పెండ్ చేస్తూ
- పాలనలో తనదైన మార్క్ చూపిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష



ఇటీవల రామగుండం పరిధిలోని స్కూల్‌లో అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

సాక్షి, పెద్దపల్లి: కలెక్టర్‌గా కోయ శ్రీహర్ష బాధ్యతలు చేపట్టిన పక్షం రోజుల్లోనే పాలనలో ప్రత్యేకత చూపిస్తున్నారు. జిల్లాలో విస్తృతంగా తనిఖీలు చేస్తూ అధికారుల్లో జవాబుదారీతనం పెంచుతున్నారు. సమయానికి కార్యాలయానికి వస్తూ అక్కడ పని చేస్తున్న సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు. ఎక్కడికి వెళ్లినా అక్కడి వారితో మమేకమవుతూ ప్రతీ విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్నారు. బాధ్యతలు చేపట్టిన కొద్దిరోజుల్లోనే స్కూల్స్, ఆసుపత్రులు, అంగన్‌వాడీ కేంద్రాలు, కార్పొరేషన్, తహసీల్దార్ కార్యాలయాలను పరిశీలిస్తూ అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించారు. వారిచ్చిన సలహాలు, సూచనలు స్వీకరిస్తూనే అధికారులుగా తామేం చేయాలో దిశానిర్దేశం చేస్తున్నారు.

**విస్తృతంగా పర్యటిస్తూ..**

ఇటీవల ప్రభుత్వ ఆసుపత్రులను తనిఖీ చేసిన కలెక్టర్ వైద్యాధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, నార్మల్ డెలివరీలు, ఔట్ పేషెంట్స్‌ను పెంచాలని సూచించారు. రామగుండం కార్పొరేషన్‌ను పరిశీలించి భూ ఆక్రమాలు, మెప్మా చేపట్టే సంక్షేమ పథకాల అమలు తీరుపై సమీక్షించారు. ప్రతీ సోమవారం ప్రజావాణికి హాజరయ్యే జిల్లా అధికారులు గతంలో కార్యక్రమం కొనసాగుతున్నంత సేపు తమ మొబైల్ ఫోన్స్‌తో కాలక్షేపం చేసేవారు. ప్రస్తుత కలెక్టర్ జిల్లా అధికారులను సమావేశం నుంచి తమ కార్యాలయాలకు పంపి, ఆ యా విభాగాల వారీగా అర్జీలు పంపిస్తాం.. వాటి ని సత్వరమే పరిష్కరించేలా చూడాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలను సందర్శించి అక్కడ అమ్మ ఆదర్శ పథకం కింద చేపడుతున్న పనుల పు రోగతిని పరిశీలించారు. తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి ధరణి అర్జీలపై ఆరా తీశారు. తబిత ఆశ్రమం, మనో చైతన్య కేంద్రం సందర్శించి అక్కడి వారి పరిస్థితులను తెలుసుకున్నారు. కలెక్టరేట్‌లోని కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసి వసతులు, ఇబ్బందులపై తెలుసుకున్నారు.

**అలసత్వం వహించిన ముగ్గురి సస్పెన్షన్**

జిల్లాలో కలెక్టర్‌గా పనిచేసిన అలుగు వర్షిణి విద్య, వైద్యంలో తనదైన పాలనతో ఆకట్టుకోగా తర్వాత వచ్చిన అధికారులు ఎవరినీ నొప్పించకుండా పనిచేయించారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ 11నెలల్లో తనదైన పాలనతో సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టారు. తాజాగా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఈనెల 16న బాధ్యతలు స్వీకరించగా, 11రోజుల్లోనే విస్తృత పర్యటనలతో అధికారుల్లో వణుకు పుట్టిస్తున్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వా రా చేపట్టే అభివృద్ధి పనులు సకాలంలో పూర్తిచేయని రామగుండం ఆర్‌అండ్‌బీ అసిస్టెంట్ ఇంజినీ ర్ ఎండీ జావిద్‌ను బుధవారం సస్పెండ్ చేశారు. కలెక్టర్ కార్యాలయంలో గురువారం ఆకస్మిక తనిఖీలు చేయగా ముందస్తు సమాచారం లేకుండా విధులకు గైర్హాజరైన భూగర్భజలశాఖ అధికారి కె.రవిశంకర్, జిల్లా ఆడిట్ అధికారి ఎం.సురేశ్‌బాబును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. గతంలో పనిచేసిన అధికారులకు భిన్నంగా ఎక్కడికక్కడే తక్షణ నిర్ణయాలతో యంత్రాంగాన్ని గాడిలో పెడుతూ పాలనలో మార్పు తీసుకొస్తున్నారు.

### సారు.. కొంచెం ఇటు చూడండి

- జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే సిబ్బందితో పాటు, ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయుల్లో 85శాతం మంది కరీంనగర్, ఇతర చుట్టుపక్కల ప్రాంతాల నుంచే రాకపోకలు సాగిస్తూ సమయపాలన పాటించడం లేదు.
- జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో సిజేరియన్ డెలివరీలు అధికంగా చేయడంతో పాటు, అత్యవసర వైద్యానికి కరీంనగర్‌కు రెఫర్ చేస్తున్నారు.
- తమ ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్యం చేస్తూ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో సమయపాలన పాటించకపోవడంతో రోగులకు నాణ్యమైన వైద్యం అందడం లేదు.
- ధరణి ఆపరేటర్లతో తహసీల్దార్ కార్యాలయాల్లో వసూళ్లు చేస్తూ కొందరు సిబ్బంది ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకొస్తున్నారు.
- మున్సిపాలిటీల్లో లేఅవుట్ లేకుండా అక్రమంగా వెలుస్తున్న వెంచర్లు, భూ ఆక్రమణలకు అడ్డుకట్టవేయాల్సి ఉంది.
- బల్దియాల్లో ఇళ్ల పర్మిషన్, అనుమతులు, వివిధ అభివృద్ధి పనుల్లో అలసత్వం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టిసారించాల్సి ఉంది.
- గతంలో స్థానిక అవసరాలకు అమలు చేసిన మన ఇసుక పాలసీని నిర్లక్ష్యం చేస్తూ మానేరులో అక్రమంగా తరలుతున్న ఇసుక ద్వారా ప్రభుత్వం ఆదాయానికి గండి పడుతుంది.
- జిల్లావ్యాప్తంగా ఇటుకబట్టీలకు అక్రమంగా తరలుతున్న మట్టి, బట్టీల్లో కార్మికులు మౌలిక వసతులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.
- పలు ప్రభుత్వ కార్యాలయాల్లో మహిళా ఉద్యోగుల కోసం ప్రత్యేక కమిటీలు వేసి నేరుగా పర్యవేక్షించాల్సిన అవసరం ఉంది.

# ఇద్దరు జిల్లా అధికారుల సస్పెన్షన్

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని రామగుండం ఆర్‌అండ్‌బీ ఏఈని సస్పెండ్ చేసి గంటలు గడవకముందే మరో ఇద్దరు జిల్లా అధికారులపై కలెక్టర్ కోయ శ్రీహర్ష సస్పెన్షన్ వేటు వేశారు. గురువారం కలెక్టరేట్‌లోని కార్యాలయాను ఆకస్మికంగా సందర్శించిన కలెక్టర్ సరిగ్గా విధులకు హాజరుకావడం లేదని గుర్తించి జిల్లా భూగర్భజలశాఖ అధికారి రవిశంకర్, జిల్లా ఆడిట్ అధికారి సురేశ్‌బాబును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా భూగర్భజలశాఖలో అసిస్టెంట్ హైడ్రోజియాలజిస్టుగా విధులు నిర్వర్తిస్తున్న ఉమాదేవికి, ఆడిట్ కార్యాలయంలో అసిస్టెంట్ ఆడిటర్‌గా పనిచేస్తున్న రవిబాబుకు బాధ్యతలు అప్పగించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సస్పెండ్ అయిన అధికారులపై విచారణ పూర్తయ్యేవరకు హెడ్‌క్వార్టర్ వదలి వెళ్లొద్దని కలెక్టర్ పేర్కొన్నారు.

### ఉత్సాహంగా పనిచేయాలి



విద్యార్థుల యూనిఫాం పరిశీలిస్తున్న పీడీ రవీందర్

ఓదెల(పెద్దపల్లి): మహిళా శక్తి సెంటర్లు ఉత్సాహంగా పనిచేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రవీందర్ పేర్కొన్నారు. గురువారం ఓదెల మండల కేంద్రంతోపాటు కనగర్తి, నాంసానిపల్లె గ్రామాల్లో పర్యటించారు. కనగర్తి, ఓదెలలో మహిళలు కుట్టిన విద్యార్థుల యూనిఫాంలను పరిశీలించారు. నాంసానిపల్లెలో మహిళాశక్తి పథకం కింద మంజూరైన మీసేవ కేంద్రానికి అనుకూలమైన భవనం గురించి ఆరా తీశారు. ఎంపీడీవో తిరుపతి, ఎంపీవో భాస్కర్, ఏఈఈ సమ్మిరెడ్డి, ఏపీఎం లతమంగేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

# మెట్రో నగరాలకు తప్పిన నీటి తిప్పలు

- హెచ్‌ఎండబ్ల్యూఎస్ పంపుహౌజ్‌లోకి ఎత్తిపోతలు
- క్రస్ట్ లెవల్‌కు చేరువలో నీటి మట్టం



హెడ్ రెగ్యులేటర్ వద్ద ఎత్తిపోతలు

రామగుండం: ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీటిమట్టం గణనీయంగా పడిపోయి క్రస్ట్ లెవల్‌కు చేరడంతో హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లయ్ (హెచ్‌ఎండబ్ల్యూఎస్) పంపుహౌజ్‌లోని మోటార్లకు నీరందని పరిస్థితి నెలకొంది. ప్రస్తుత కరువు పరిస్థితులను ముందే గుర్తించిన హెచ్‌ఎండబ్ల్యూఎస్ ఉన్నతాధికారులు నెల క్రితమే ముందస్తుగా మోటార్లను సిద్ధం చేశారు. రెండురోజుల నుంచి ఎత్తిపోతలు ప్రారంభించి మెట్రో నగరాల ప్రజల తాగునీటి అవసరాలను తీర్చుతున్నారు.

**క్రస్ట్ లెవల్‌కు చేరకముందే..**

ఎల్లంపల్లి సామర్థ్యం 20.175 టీఎంసీలు కాగా గురువారం ప్రాజెక్టులో 3.91 టీఎంసీలు మాత్రమే నిల్వ ఉన్నాయి. ఇదే రోజు గతేడాది 11.99 టీఎంసీల నీరు ఉంది. ప్రాజెక్టులోకి 386 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉండగా, ఎన్టీపీసీకి 121 క్యూసెక్కులు, హైదరాబాద్ మెట్రోకు 331 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో ఉంది. ప్రాజెక్టు క్రస్ట్ లెవల్ స్థాయిలో నీటిమట్టం ఉండడంతో మెట్రో పంపుహౌజ్ మోటార్లకు నీరందక పంపింగ్ నిలిచిపోయే ప్రమాదం ఉండడంతో ముందస్తుగానే ఎత్తిపోతలు ప్రారంభించారు.

**హెడ్ రెగ్యులేటరీ వద్ద ఎత్తిపోతలు..**

ప్రాజెక్టులో 1.8 మీటర్ల లోతట్టు (జీరోపాయింట్) వద్ద పది మీటర్ల లోతులో 125 హెచ్‌పీ సామర్థ్యం గల 25 సబ్ మెర్సిబుల్ మోటార్లతో హెడ్ రెగ్యులేటరీ వద్ద ఎత్తిపోస్తుండగా వరద నీరు గ్రావిటీ కెనాల్ నుంచి హెచ్‌ఎండబ్ల్యూఎస్ మోటార్లకు చేరుతుంది. అక్కడి నుంచి మోటార్ల ద్వారా మెట్రో నగరాలకు నీటి పంపింగ్ జరుగుతుంది. ప్రస్తుతం రోజూ కనీసం 331 క్యూసెక్కుల నీటిని పంపింగ్ చేస్తున్నట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు.


**మెట్రో పంపుహౌజ్ నుంచి..**

ఎల్లంపల్లిలో 138.3 మీటర్ల (3.3 టీఎంసీలు) ఎత్తు వరకు వరద నీరు ఉన్నప్పుడే పంపింగ్ సాధ్యపడనుంది. ఫలితంగా నీటిమట్టం రోజూ తగ్గడంతో ప్రత్యేక మోటార్లతో పంపుహౌజ్ గ్రావిటీ కెనాల్‌లోకి ఎత్తిపోస్తుండడంతో మెట్రో నగరాలతో పాటు భగీరథ నీటి అవసరాలకు కూడా పంపింగ్ జరుగుతుంది.

**పది రోజుల పాటు పంపింగ్ జరగనుందా..?**

ఇటీవల కురిసిన వర్షాలకు కడెం ప్రాజెక్టులోకి వరద చేరి, అక్కడి నుంచి ఎల్లంపల్లిలోకి వదిలితే నీటిమట్టం పెరిగి హెచ్‌ఎండబ్ల్యూఎస్ పంపుహౌజ్ వద్ద కొనసాగుతున్న ఎత్తిపోతలకు బ్రేక్ పడనుంది. కాగా ఎత్తిపోతలు గరిష్టంగా మరో పది రోజుల లోపే నిలిపివేసే అవకాశాలు లేకపోలేదని అధికారులు పేర్కొంటున్నారు. ఇదే తరహా కరువు పరిస్థితులు కొనసాగితే ప్రాజెక్టులో నీటిమట్టం పడిపోయి డెడ్‌స్టోరేజీ (0.69 టీఎంసీలు) చేరే ప్రమాదం లేకపోలేదని భావిస్తున్నారు.

### అమ్మా.. ఏమైనా సమస్యలున్నాయా..



వార్డు సందర్శనలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: ‘అమ్మా బాగున్నర.. నల్లా నీళ్లు వస్తున్నయా..ఇంక ఇబ్బందులేమైనా ఉన్నాయా’..అంటూ ఎమ్మెల్యే విజయరమణారావు గురువారం మున్సిపల్ పరిధిలోని 6,7వార్డులను సందర్శించి సమస్యలపై ఆరా తీస్తూ వార్డు సందర్శన కార్యక్రమానికి శ్రీకారంచుట్టారు. జిల్లా కేంద్రంగా మారిన పెద్దపల్లి పట్టణాన్ని ఆ స్థాయికి తగ్గట్టుగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతా మని పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలోని 36 వార్డులను సందర్శించి సమస్యలను పరిశీలిస్తామని తెలి పారు. పట్టణ ప్రజలకు కనీస మౌలిక వసతుల కల్పనకు రూ.30కోట్లతో పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్, ఏఈ సతీశ్, మేనేజర్ శివప్రసాద్, కౌన్సిలర్లు, నాయకులు ఉన్నారు.

## క్లుప్తంగా

### రైస్‌మిల్లుల్లో టాస్క్‌ఫోర్స్‌ దాడులు



జమ్మికుంట/ఇల్లందకుంట(హుజూరాబాద్‌): టాస్క్‌ఫోర్స్‌ ఓఎస్‌డీ ప్రభాకర్‌ ఆధ్వర్యంలో జగిత్యాల డీఎస్‌వో వెంకటేశ్‌, డీఎం హతీరామ్‌ బృందం గురువారం సాయంత్రం రైస్‌మిల్లుల్లో దాడులు చేశారు. జమ్మికుంట మండలంలోని మహాశక్తి ఆగ్రో ఇండస్ట్రీస్‌, ఇల్లందకుంట మండలంలోని సీతారామ మిల్లుల్లో సీఎమ్మార్‌, ధాన్యం నిల్వలను పరిశీలించారు. రెండు మిల్లుల్లో 2022–23 సంవత్సరానికి సంబంధించిన ధాన్యం వివరాలను సేకరించినట్లు తెలిపారు. సివిల్‌ సప్లయ్‌ కమిషనర్‌కు నివేదిక అందిస్తామన్నారు. టాస్క్‌ఫోర్స్‌ అధికారులు జంగారెడ్డి, లక్ష్మారెడ్డి, కృష్ణ, హుజూరాబాద్‌, వీణవంక తహసీల్దార్లు విజయ్‌కుమార్‌, లక్ష్మణ్‌, హుజూరాబాద్‌ డీటీ వసంతరావు, ఎఫ్‌ఐ వినోద్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

**రూ.కోట్ల విలువైన ధాన్యం మాయం?**

టాస్క్‌ఫోర్స్‌, సివిల్‌ సప్లయ్‌ అధికారులు దాడులు నిర్వహించిన మిల్లుల్లో రూ.కోట్ల విలువైన ధాన్యం మాయమైనట్లు సమాచారం. గత డిసెంబర్‌లోనూ ఇవే మిల్లులపై దాడులు చేశారు. ఏ మేరకు చర్యలు తీసుకుంటారో వేచిచూడాలి.

### అల్ఫోర్స్‌ ఇ-టెక్నోలో అట్టహాసంగా ‘హౌజ్‌ ఎలక్షన్స్‌’



కొత్తపల్లి(కరీంనగర్‌): కొత్తపల్లిలోని అల్ఫోర్స్‌ ఇ టెక్నోస్కూల్‌లో గురువారం హౌజ్‌ ఎలక్షన్స్‌ అట్టహాసంగా జరిగాయి. పాఠశాలలో ఎన్నికల సందడి నెలకొనగా..తేజస్‌, సరస్‌, ధృవ, లక్ష్య విభాగాలకు కెప్టెన్‌, వైస్‌ కెప్టెన్లను ఎన్నుకున్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన అల్ఫోర్స్‌ విద్యా సంస్థల చైర్మన్‌ డా.వి.నరేందర్‌ రెడ్డి మాట్లాడుతూ భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికలు చాలా కీలకమని, ఈ ఎన్నికల ద్వారానే సుస్థిర ప్రభుత్వాన్ని ఏర్పరుచుకుంటామన్నారు. విద్యార్థులకు ప్రాథమిక దశనుండే ఎన్నికలపై అవగాహన కల్పించడానికి, విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

### తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు మృతి



మెట్‌పల్లిరూరల్‌: తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు మృతి చెందిన ఘటన మెట్‌పల్లి మండలం వెల్లులలో గురువారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన జుంగుల గంగాధర్‌(52) ఎప్పటిలాగే తాటి కల్లు తీసేందుకు చెట్టు ఎక్కాడు. కల్లు తీస్తున్న క్రమంలో మోకు జారి కిందపడ్డాడు. నడుం భాగంలో బలమైన గాయమై అక్కడే చనిపోయాడు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. గంగాధర్‌ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గౌడ కులస్తులు కోరారు.

**CHANGE OF NAME**

నాపేరు పాడిశెట్టి మిత్ర, తండ్రి: రవిందర్‌ గ్రామం: తారుపల్లి, మండలం: కాల్వశ్రీరాంపూర్‌, జిల్లా: పెద్దపల్లి, ఇంటి నంబరు 3-48, గెజిట్‌ ద్వారా **పాడిశెట్టి సాయి నందన్‌గా** తండ్రి: రవిందర్‌ మార్చుకున్నాను. సెల్‌: 8790012591

# భూములు సాగులో ఉన్నాయా.. లేవా?

- ఫైలట్‌ ప్రాజెక్టు కింద మొదలైన సర్వే
- ఆ తర్వాతే అన్నదాతలకు రైతు భరోసా
- జూలై 1లోగా పూర్తయ్యేనా..?

కరీంనగర్‌ అర్బన్‌: రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు మొదలుపెట్టింది. ఇప్పటికే రైతుకు ఎంత భూమున్నా 5 ఎకరాల వరకే రైతు భరోసా ఇస్తామని సూత్రప్రాయంగా నిర్ణయించగా అనర్హులతో పాటు రాళ్లు, రప్పలు, థియేటర్లు, మిల్లులు, విద్యాలయాలు, నివాసాలు, ఫంక్షన్‌హాళ్లు సాగు భూములుగా ఉండటంతో వాటిని సాగుభూముల నుంచి తొలగించాలని నిర్దేశించింది. దీంతో అధికార యంత్రాంగం సదరు పనుల్లో నిమగ్నమవగా గడువులోగా పూర్తవుతుందా.. లేదా..నన్నది ప్రశ్నార్థకమే. జిల్లాను పైలట్‌ ప్రాజెక్టుగా ఎంపిక చేయగా ఇప్పటికే ఏఈవోలు, పంచాయతీ కార్యదర్శులు సర్వే ప్రారంభించారు. అనుమానిత సర్వే నంబర్లను జిల్లా యంత్రాంగానికి చేర్చగా ఏఈవోలు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ యాప్‌లో చిత్రాలతో సహా పొందుపరుస్తున్నారు.

**పక్కాగా యాప్‌.. చిత్రం తీయాల్సిందే**

రాష్ట్రంలో ఐదు జిల్లాలను పైలట్‌ ప్రాజెక్టు కింద భూ వినియోగ సర్వేకు ఎంపిక చేయగా కరీంనగర్‌ జిల్లా ఒకటి. ఏఈవో, పంచాయతీ కార్యదర్శులు ల్యాండ్‌ యుటిలైజేషన్‌ సర్వే యాప్‌ను వినియోగిస్తున్నారు. వ్యవసాయ భూమిగా పేర్కొంటున్న దానిలో వాస్తవంగా వ్యవసాయమే చేస్తున్నారా, లేఅవుట్లు చేసి ప్లాట్లుగా మార్చారా, ఇప్పటికే ఏమైనా నిర్మాణాలు ఉన్నాయా, లేక సాగుకు వినియోగం



యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్న ఏఈవో రాము

లేని భూమిగానో, బీడు భూమిగానో ఉందా అన్న వివరాలు నమోదు చేస్తున్నారు. గ్రామ కార్యదర్శులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, ఐకేపీ సీసీలు క్షేత్రస్థాయికి వెళ్లి అనుమానిత సర్వే నంబర్ల వారీగా సర్వే నిర్వహిస్తారు. ఆ భూమి పట్టాదారు ఎవరు, ఎంత విస్తీర్ణం, సాగులో ఉందా లేదా అన్న వివరాలను అక్కడే నమోదు చేసి యాప్‌లో అప్లోడ్‌ చేస్తారు. సదరు యాప్‌ ఫీల్డ్‌లోకి వెళితేనే పని చేస్తుండగా పేర్కొన్న సర్వే నంబర్‌లో ఉంటేనే అక్సెప్ట్‌ చేస్తుంది.

**రూ.కోట్లు ఆదా**

సర్వే ద్వారా వెల్లడైన సమాచారంతో కమర్షియల్‌ భూములుగా వాటి విలువలు పెంచడానికి, అలాంటి వాటికి సాగులో లేని వాటికి రైతు భరోసా పథకం కింద సహాయం అందించకుండా ఉండడానికి ఉపయోగపడుతుంది. దీంతో ప్రస్తుతం రైతు భరోసా పథకం కింద బీడు, బంజరు భూములు, వినియోగంలో లేని భూములు, ఇప్పటికే లేఅవుట్లు చేసి ప్లాట్లుగా విక్రయించిన భూములకు ఆర్థిక సహాయం అందుతోంది. కోట్లాది రూపాయలు అనర్హుల జేబుల్లోకి వెళ్తున్నాయి. వ్యవసాయ భూములను అనుమతి లేకుండా లేఅవుట్లు చేసి విక్రయిస్తున్న వారు దర్జాగా తమ తమ వ్యాపార ప్రకటనల్లో ఈ భూమి ప్లాట్ల వివరాలను పేర్కొంటూ రైతు భరోసా సహాయం అందుతున్నదని బాహాటంగా పేర్కొంటూ వ్యాపారాన్ని పెంచుకుంటున్నారు. అలాంటి అక్రమాలకు ఈ సర్వే సమాచారంతో అడ్డుకట్ట పడనుంది. జిల్లాలో రైతు భరోసా (రైతుబంధు) నిధుల వివరాలను పరిశీలిస్తే సాగులో లేని భూములకు కూడ సాయం అందిందన్నది సుస్పష్టం. రైతు భరోసా తీసుకుంటున్న భూముల్లో కనీసం 20 నుంచి 25శాతం ఇప్పటికే కమర్షియల్‌ ప్లాట్లుగా మారాయని, వాటితోపాటు వినియోగంలేని భూములు ఉన్నాయని అంచనా వేస్తున్నారు. ఈ సర్వే వివరాలు వెల్లడైతే ఆ సమాచారంతో అసలైన రైతులకు మాత్రమే రైతు భరోసా సహాయం అందే అవకాశం ఉంది.

**మరో రెండు రోజుల్లో పూర్తయ్యేనా..?**

జిల్లావ్యాప్తంగా సర్వే జరుగుతుండగా 5 రోజుల్లో పూర్తవడం అసాధ్యమే. జిల్లాలో చాలా చోట్ల ఏఈవోలు లేరు. సదరు ప్రాంతాల్లో పంచాయతీ కార్యదర్శులను వినియోగిస్తున్నారు. మొత్తం భూమి కాకుండా ప్రభుత్వానికి అనుమానమున్న సర్వే నంబర్లను ఒక్కో ఏఈవోకు సుమారు 2800ల నుంచి 5400ల సర్వే నంబర్లు వివరాలను అందజేశారు. ఏఈవోలకు ఏ సర్వే నంబర్‌ ఎక్కడుందో అవగాహన ఉండగా పంచాయతీ కార్యదర్శులకు అవగాహన లేకపోవడంతో సర్వే మందకొడిగా సాగుతోంది. సహాయకులుగా వీఆర్‌ఏలను కేటాయిస్తే వేగం పుంజుకోనుంది. సోమవారం లోగా సర్వే పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించినప్పటికీ పూర్తవడం కష్టమే.

# సింగరేణి బకాయిలు వెంటనే చెల్లించాలి



మాట్లాడుతున్న యాదగిరి సత్తయ్య

రామగిరి: సింగరేణి బొగ్గు, విద్యుత్‌ బకాయిలు రూ.29వేల కోట్లు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని బీఎంఎస్‌ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్‌ చేశారు. ఆర్జీ–3 పరిధిలోని ఓసీపీ–2లో గురువారం నిర్వహించిన గేట్‌ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం రాజకీయ కారణాలతో బొగ్గు బ్లాక్‌ వేలంలో పాల్గొనకుండా సింగరేణి మనుగడకు తీరని అన్యాయం చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బకాయిలను చెల్లించి ఆర్థిక సంక్షోభం నుంచి కాపాడాలన్నారు. కోల్‌ ఇండియా మాదిరిగా సింగరేణిలో కాంట్రాక్టు కార్మికులకు హైపవర్‌ కమిటీ వేతనాలు చెల్లించాలని కోరారు. టీబీజీకేఎస్‌ నాయకులు రౌతు రమేశ్‌ బీఎంఎస్‌లో చేరగా కండువా కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. ఆర్జీ–3 డివిజన్‌ ఉపాధ్యక్షుడు అర్కాల స్వామిగౌడ్‌ అధ్యక్షతన జరిగిన గేట్‌ మీటింగ్‌లో పొన్నమనేని వేణుగోపాల్‌ రావు, వై.సారంగపాణి, మర్రి సంతోష్‌, కొంద్ర ఐలయ్య, విద్యాసాగర్‌, కృష్ణ పాల్గొన్నారు.



## మళ్లీ రాకపోకలు బంద్‌

వేములవాడరూరల్‌: వర్షాలు కురిశాయంటే ఆ ప్రాంత ప్రజలకు కష్టాలు మొదలవుతాయి. వేములవాడ రూరల్‌ మండలం హన్మాజిపేట నక్కవాగు వరద నీరు ప్రవహించడంతో మళ్లీ కష్టాలు మొదలయ్యాయి. ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్న ఈ ప్రాంత ప్రజలను దృష్టిలో పెట్టుకుని గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వంలో రూ.11.55 కోట్లతో నూతన బ్రిడ్జిని మంజూరు చేశారు. ఇప్పటికీ నెలలు గడుస్తున్నా పనులు పూర్తికాకపోవడంతో మళ్లీ వర్షాలు ప్రారంభంకావడంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి నక్కవాగుపై మళ్లీ నీరు ప్రవహిస్తోంది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

### గుండెపోటుతో హెడ్‌కానిస్టేబుల్‌ మృతి



ఇల్లందకుంట(హుజూరాబాద్‌): గుండెపోటుతో ఓ హెడ్‌ కానిస్టేబుల్‌ మృతిచెందారు. వివరాల్లోకి వెళ్తే.. ఇల్లందకుంట మండలంలోని శ్రీరాములపల్లికి చెందిన మేకల శ్రీనివాస్‌(52) కరీంనగర్‌ పోలీస్‌ హెడ్‌ క్వార్టర్స్‌లో హెడ్‌ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు. బుధవారం అర్ధరాత్రి విధుల్లో ఉన్న ఆయనకు అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో చనిపోయాడు. మృతునికి భార్య శ్రీలత, కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు. గురువారం స్వగ్రామంలో పోలీస్‌ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. హుజూరాబాద్‌ ఏసీపీ శ్రీనివాస్‌జీ, జమ్మికుంట రూరల్‌ సీఐ కిశోర్‌, ఇల్లందకుంట ఎస్సై రాజ్‌కుమార్‌ మృతుని కుటుంబసభ్యులను ఓదార్చి, అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

### ‘ఆన్‌లైన్‌’ మనీ దందా!

- ఆందోళన చెందుతున్న పెట్టుబడిదారులు

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లాలో ఆన్‌లైన్‌ వడ్డీ వ్యాపారం జోరందుకుంది. రూపాయి పెట్టుబడి పెడితే.. రెండు రూపాలు ఇస్తామంటూ ఆయా కంపెనీలకు చెందిన వారు ప్రచారం చేస్తున్నారు. కస్టమర్లను ఆకర్షించేందుకు విదేశీ టూర్లు అరెంజ్‌ చేస్తున్నారు. జిల్లాలో వేలాది మంది సుమారు 13 కంపెనీల్లో రూ. 800 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టారు. అయితే వడ్డీ చెల్లించలేని ఓ కంపెనీ ఇప్పటికే బిచాన ఎత్తేసినట్లు తెలిసింది. వరంగల్‌, కరీంనగర్‌ జిల్లాలో అత్యధికంగా పెట్టుబడులు పెట్టించిన ఓ కంపెనీ వారం రోజులుగా ఆర్థిక లావాదేవీలు నిలిపివేసింది. దీంతో పెట్టుబడిదారులంతా ఆందోళన చెందుతున్నారు. యాప్‌ కూడా క్లోజ్‌ కావడంతో మనోవేదనకు గురవుతున్నారు.

### పోలీసుల అదుపులో దొంగల ముఠా..?

జగిత్యాలక్రైం: జగిత్యాలలో చోరీలకు పాల్పడుతున్న ముఠాను పోలీసులు పట్టుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇటీవల తాళం వేసి ఉన్న ఇళ్లలో వరుస చోరీలు జరుగుతున్నాయి. మల్యాల మండలం తాటిపల్లి, రాయికల్‌ మండలకేంద్రంలో తాళం వేసిన ఇళ్లలో చోరీలకు పాల్పడినట్లు అనుమానం ఉన్న జగిత్యాలరూరల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధి టీఆర్‌నగర్‌కు చెందిన వ్యక్తులను మల్యాల పోలీసులు అదుపులోకి తీసుకుని కొంత బంగారాన్ని రికవరీ చేసినట్లు సమాచారం. అయితే దొంగలు పెద్ద ఎత్తున చోరీకి పాల్పడినట్లు పోలీసుల విచారణలో వెల్లడించినట్లు సమాచారం.

### తాళం వేసిన ఇంట్లో చోరీ

మల్యాల(చొప్పదండి): మండలంలోని ఒబులాపూర్‌లో తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి నగదు, నగలు ఎత్తుకెళ్లారు. ఎస్సై కుమారస్వామి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కనగర్తి రేణుక బుధవారం ఇంటికి తాళం వేసి వెదిరలోని తన తల్లిగారింటికి వెళ్లింది. గురువారం ఉదయం వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లిచూడగా బీరువా పగులగొట్టి అందులోని 17 తులాల వెండి, 2గ్రాముల బంగారం, రూ.25వేల నగదు ఎత్తుకెళ్లినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

# స్పందించి.. వైద్యం అందించి..

- ఉద్యోగి ప్రాణాలు కాపాడిన ఎన్టీపీసీ అధికారులు, పోలీసులు



అచేతనంగా పడి ఉన్న దస్తగిరి

జ్యోతినగర్‌(రామగుండం): మనిషి ప్రాణం పోతున్నా పట్టించుకోకుండా ఫొటోలు, వీడియోలు తీస్తూ చోద్యం చూస్తున్న నేటి సమాజంలో ఇంకా మానవత్వం మిగిలి ఉందని నిరూపించిన ఘటన ఎన్టీపీసీ రామగుండం పర్మనెంట్‌ టౌన్‌షిప్‌లో జరిగింది. వివరాలు.. ఎన్టీపీసీ రామగుండం పర్మనెంట్‌ టౌన్‌షిప్‌ ఏ4–96 క్వార్టర్‌లో నివాసముంటున్న విజయవాడకు చెందిన దస్తగిరి ప్రాజెక్టులోని ఎంజీఆర్‌ విభాగంలో లోకో పైలట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గురువారం ఉదయం షిఫ్టునకు విధులకు రాకపోవడంతో తోటి ఉద్యోగులు అతడికి ఫోన్‌ చేశారు. లిఫ్ట్‌ చేయకపోవడంతో సంబంధిత అధికారులకు విషయం తెలిపారు. వెంటనే ఎన్టీపీసీ ఏజీఎం(హెచ్‌ఆర్‌) బిజయ్‌కుమార్‌ సిగ్దర్‌, డీజీఎం ప్రవీణ్‌కుమార్‌చౌదరి, పీటీఎస్‌ ఎస్టేట్‌ అధికారి రఘునాథ్‌ స్పందించి దస్తగిరి నివాసముంటున్న క్వార్టర్‌కు వచ్చి చూడగా ఇంటి లోపలివైపు తలుపులకు గడియ వేసి ఉంది. పోలీసులకు సమాచారం అందించగా బ్లూ కోల్ట్స్‌ సిబ్బంది ఫహీద్‌, శ్రీనివాస్‌, ధన్వంతరీ ఆస్పత్రి డాక్టర్‌ శివకుమార్‌, ఈఎంటీ నిఖిల్‌, పైలట్‌ రాజేందర్‌ అంబులెన్స్‌తో వచ్చారు. తలుపులను గట్టిగా తన్నడంతో గడియ ఊడింది. మధుమేహంతో ఇంట్లో అచేతనంగా పడిపోయిన దస్తగిరికి డాక్టర్‌ శివకుమార్‌ వైద్యం అందిస్తూ ఆస్పత్రికి తీసుకెళ్లారు. దస్తగిరికి సకాలంలో వైద్యం అందడంతో అతడి ప్రాణాలు నిలిచాయి. ఈసందర్భంగా ఎన్టీపీసీ హెచ్‌ఆర్‌ అధికారులు, పోలీసులను స్థానికులు అభినందించారు.

# సిరిసిల్లలో రూ.3కోట్లతో వ్యాపారి పరార్‌

- లబోదిబోమంటున్న బాధితులు

సిరిసిల్ల: సిరిసిల్ల పట్టణంలోని మార్కెట్‌(లేబర్‌ అడ్డా) ప్రాంతంలో టీవీల ఎలక్ట్రానిక్‌ వస్తువుల షోరూం నిర్వాహకుడు రాజు రూ.3కోట్లతో పరారయ్యాడు. నమ్మకంగా వ్యాపారం చేసిన సదరు వ్యక్తి రూ.3కోట్ల వరకు తెలిసిన వారు, సమీప బంధువుల వద్ద డబ్బులు తీసుకుని ఉడాయించాడు. చిట్‌ఫండ్‌ల్లో చిట్టీలు ఎత్తుకుని ప్రభుత్వ ఉద్యోగులు పలువురిని ష్యూరిటీగా సంతకాలు పెట్టించాడు. దీంతో సదరు వ్యాపారి రాజు ఎత్తుకున్న చిట్‌ఫండ్‌ డబ్బులు ఉద్యోగులు కట్టాల్సిన పరిస్థితి ఎదురైంది. మూడు నెలల కిందటే ఇల్లును రూ.40లక్షలకు గుట్టుచప్పుడు కాకుండా అమ్మేసిన రాజు దుకాణానికి, ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో సహా ఊరి విడిచి వెళ్లాడు. ముందుగా అతను రూ.కోటిన్నరతో ఉడాయించినట్లు ప్రచారం జరగ్గా.. అది కాస్త రూ.3కోట్లకు చేరింది. అతనికి అప్పులు ఇచ్చిన వారు, చిట్టీలకు, చిట్‌ఫండ్‌లకు జమానాతుగా ఉన్న వారు లబోదిబోమంటున్నారు. సిరిసిల్లలో చాలా కాలంగా నమ్మకంగా వ్యాపారం చేసిన రాజు సిరిసిల్ల, తంగళ్లపల్లి, ఎల్లారెడ్డిపేట మండలంలోని పలువురి వద్ద అప్పులు తీసుకున్నట్లు సమాచారం. నమ్మకంగా పలువురి వద్ద రూ.లక్ష నుంచి రూ.20 లక్షల వరకు అప్పుగా తీసుకున్నట్లు తెలిసింది. రాజు ఊరు విడిచిపోవడంతో అప్పులు ఇచ్చిన వారు ఆందోళనకు గురవుతున్నారు. మహారాష్ట్రలోని పుణె ప్రాంతంలో రాజు ఉంటున్నట్లు సెల్‌ఫోన్‌ నెట్‌వర్క్‌ ద్వారా తెలిసినట్లు సమాచారం.

# మీడియా అడ్వర్టైజ్‌మెంట్‌ కార్యవర్గం



ఎన్నికైన నూతన కార్యవర్గం

కరీంనగర్‌: ప్రింట్‌ అండ్‌ ఎలక్ట్రానిక్‌ మీడియా అడ్వర్టైజ్‌మెంట్‌ అసోసియేషన్‌ కరీంనగర్‌శాఖ కార్యవర్గం గురువారం ఎన్నికైంది. నగరంలోని మినీ పద్మనాయక కల్యాణ మండపంలో అసోసియేషన్‌ సభ్యులు సమావేశమయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా దండె జనార్దన్‌రెడ్డి, అధ్యక్షుడిగా యెలిగేటి కమలాకర్‌, ప్రధాన కార్యదర్శిగా గంగుల మహేందర్‌రెడ్డి, కోశాధికారిగా కొమిరె మల్లయ్య గౌడ్‌, ఉపాధ్యక్షుడిగా రేణ మల్లయ్య, ఆకుల నాగయ్య, పిచర లక్ష్మణ్‌రాజు, సంయుక్త కార్యదర్శులుగా సిరిపురం నాగభూషణం, ముస్కు విద్యాసాగర్‌రెడ్డి, ఆర్గనైజింగ్‌ సెక్రటరీగా కటుకం కేశవ్‌, బరిగేల ఆంజనేయులు, కార్యవర్గ సభ్యులుగా ఎన్‌.లక్ష్మణ్‌ రావు, జే.సత్యారాజ్‌, ఎం.కుమార్‌, యూ.రాజేశం, ఎస్‌.శ్రీధర్‌, ఎం.డీ.అజీజ్‌, బి.కనుకయ్యగౌడ్‌, ప్రవీణ్‌ కుమార్‌, ఏ.మునీశ్వర్‌, ఎం.చక్రపాణి ఎన్నికయ్యారు. వీరిని రాము యాడ్‌ ఏజెన్సీ నిర్వాహకుడు రాము సన్మానించారు.

# హుజూరాబాద్‌లో యువకుడిపై దాడి

- బాధితుడు నల్గొండ జిల్లావాసి

హుజూరాబాద్‌: తన భార్యను తీసుకెళ్లాడంటూ ఓ వ్యక్తి ఓ యువకుడిపై దాడి చేసిన ఘటన గురువారం హుజూరాబాద్‌లో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. నల్గొండ జిల్లా దేవరకొండవాసికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు. అతని భార్య అదే గ్రామానికి చెందిన యువకుడితో కలిసి ఏడాది క్రితం ఇంటినుంచి వెళ్లిపోయింది. అప్పటినుంచి భర్త ఆమె కోసం వెతుకుతున్నాడు. ఈ క్రమంలో ఆ ఇద్దరూ 6 నెలలుగా హుజూరాబాద్‌లో ఉంటున్నారని తెలుసుకున్నాడు. గురువారం కారులో తన ఇద్దరు స్నేహితులను తీసుకొని, వచ్చాడు. వారు నివాసం ఉండే ఏరియాకు రాగా సదరు యువకుడు కనిపించాడు. అతన్ని కారుతో ఢీకొట్టి, బలవంతంగా వాహనంలో ఎక్కించుకొని, పట్టణ శివారులోని కేసీ క్యాంపు కెనాల్‌ వద్దకు తీసుకెళ్లి, దాడి చేశారు. గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించగా వచ్చి, నిందితులను పట్టుకున్నారు. కారును సీజ్‌ చేసి, మొత్తం ఐదుగురినీ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

# ఉపాధి కూలీల వేతనాలు విడుదల చేయాలి



మాట్లాడుతున్న ప్రసాద్‌

కరీంనగర్‌: గ్రామీణ ఉపాధి హామీలో పనిచేసిన కూలీల పెండింగ్‌ వేతనాలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.ప్రసాద్‌ డిమాండ్‌ చేశారు. గురువారం సంఘ కార్యాలయంలో సుంకరి సంపత్‌ అధ్యక్షతన జరిగిన సదస్సులో పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం వ్యవసాయ కూలీల కనీస వేతనాలను పెరిగిన ధరలకు అనుగుణంగా రివైజ్‌ చేసి పెంచడం లేదన్నారు. వారికి వారం రోజుల్లో వేతనాలు చెల్లించాలని చట్టం డైరెక్షన్‌ ఉన్నా మూడు నెలల పెండింగ్‌ ఉందన్నారు. కూలీలకు వేతనాలు అందక ప్రభుత్వ ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. తక్షణమే పెండింగ్‌ వేతనాలను విడుదల చేయాలని, కనీస వేతనం రోజు కూలి రూ.600కు పెంచాలని పని దినాలను 200 రోజులు పెంచాలని డిమాండ్‌ చేశారు. ఈ సదస్సులో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కవ్వంపెల్లి అజయ్‌, వడ్ల రాజు, జిల్లా సహాయ కార్యదర్శి రాయకంటి శ్రీను, అంబాల సుశీల, స్వప్న, మంగ తదితరులు పాల్గొన్నారు.

**సాక్షి క్లాసిఫైడ్స్‌**

**SERVICES**

**BUSINESS OFFER**

■ లాభదాయకమైన వ్యాపారం కోసం లేడీస్‌ శానిటరీ ప్యాడ్‌, బేబీ డైపర్‌ మెషిన్‌ స్థాపించండి. ప్లాస్టిక్‌ ఉద్యోగ్‌తో బై బ్యాక్‌ అగ్రిమెంట్‌. (Govt. అప్రూవ్‌) 8376001873, 9643010487, 8376089771, 011-25920179 [DA-5787]

**WANTED**

■ Wanted MBA Qualified Male or Female Experienced Candidate to Work in Armania Exchange & Money Transfer. Contact No. 9491151939, 6303961198 [K-1187229]

■ త్రివేణి హోంకేర్‌ హైదరాబాద్‌ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్‌ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి/భోజనం జీతం : 18K ఫోన్‌: 9160900024 / 9640400073 [H-799897]

■ పెద్దపల్లిలోని ప్రముఖ ఇన్సూరెన్స్‌ కంపెనీ కోసం సేల్స్‌ మేనేజర్స్‌ కావలెను. జీతం: నెలకు రూ॥ 20,000/- వరకు (అనుభవం ఆధారంగా) + ఇన్సెంటీవ్స్‌, అర్హత: ఏదైనా డిగ్రీతో పాటు కనీసం 1సం॥ అనుభవం తప్పనిసరి. సంప్ర॥ సెల్‌: 8096633777 [K-1187426]

**గమనిక**

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్‌ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్‌ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్‌ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్‌ / డిపాజిట్‌ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

www.sakshi.com

For Classifieds, Advertisements Contact: 9951602933, 9951602824

# పంటలసాగు ప్రశ్నార్థకమేనా!

- నీరు లేక వెలవెలబోతున్న వరదకాల్వ
- వానాకాలంలోనూ నీరందడంపై అనుమానాలు
- ఆరు నెలలుగా తగ్గుతున్న నీటి నిల్వలు
- కాల్వలోని నీరు నారుమళ్లకే సరిపోతుందన్న రైతులు
- ప్రాజెక్టుల్లో నీరు లేక వరదకాల్వలోనూ అడుగంటిన వైనం
- ఆందోళనలో రైతులు



అరకొర నీటి నిల్వలతో వరదకాల్వ

బోయినపల్లి(చొప్పదండి): వరదకాల్వ పరిసరాల్లో పంటల సాగుపై అనుమానాలు నెలకొన్నాయి. వరదకాల్వలో నీరు లేకపోవడం.. పైనున్న ప్రాజెక్టుల్లోనూ నీళ్లు అడుగంటడంతో వరదకాల్వ కింద ఉన్న పొలాల్లో పంటల సాగు ప్రశ్నార్థకంగా మారింది. ఏ సీజన్‌లోనైనా వరదకాల్వలో నీరు పుష్కలంగా ఉండేది. కానీ ప్రస్తుతం వర్షాకాలంలోనూ నీరు లేక వరదకాల్వ వెలవెలబోతుంది.

**రెండు జిల్లాలు.. 3వేల ఎకరాలు**

రాజన్నసిరిసిల్ల జిల్లాలోని బోయినపల్లి మండలం విలాసాగర్‌, మర్లపేట, దేశాయిపల్లి, వరదవెల్లి, కరీంనగర్‌ జిల్లా రామడుగు మండలం తిర్మలాపూర్‌, శ్రీరాములపల్లి, రామడుగు, షానగర్‌, పందికుంటపల్లి, గంగాధర మండలం కొండన్నపల్లి, కురిక్యాల, రంగారావుపల్లి, గర్శకుర్తి, తాడిజెర్రి గ్రామాల రైతులు ఏటా రెండు సీజన్లలో పంటలు సాగు చేస్తారు. దాదాపు 3వేల ఎకరాల్లో పంటలు పండుతాయి. ఎస్సారెస్పీలో నీటినిల్వలు తగ్గడం కాళేశ్వరం ప్రాజెక్టులో నీరు నింపే అవకాశం లేకపోవడంతో వరదకాల్వకు గత ఆరు నెలలుగా నీరు విడుదల చేయడం లేదు. ప్రస్తుతం వరదకాల్వలో సుమారు రెండు ఫీట్ల లోతులో మాత్రమే నీరు ఉంది. ఈ నీరు నారుమడులు తడపడానికే సరిపోదని రైతులు వాపోతున్నారు.

**122 కిలోమీటర్ల మేర వరదకాల్వ**

జలయజ్ఞంలో భాగంగా శ్రీరామ్‌సాగర్‌ ప్రాజెక్టు నిజామాబాద్‌ జిల్లా బాల్కొండ నుంచి రాజన్నసిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం వరదవెల్లి క్రాస్‌ రెగ్యులేటర్‌ వరకు వైఎస్సార్‌ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 122 కిలోమీటర్ల మేర వరదకాల్వను నిర్మించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించక ముందు మిడ్‌మానేరు ప్రాజెక్టులోకి ఎస్సారెస్పీ నుంచి వయా వరదకాల్వమీదుగా నీరు విడుదల చేసేవారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించిన తర్వాత ఐదేళ్లుగా వరదకాల్వలో దాదాపు అర టీఎంసీ మేర నీరు ఉండేది. ఆ నీటి ఆధారంగా రైతులు వివిధ రకాల పంటలు పండించేవారు. మేడిగడ్డ బ్యారేజీ కుంగడంతో ప్రాజెక్టులో ఉన్న నీరు బయటకు వదిలారు. దీనికితోడు గతేడాది వర్షాకాలం చివరిలో వానలు సరిగ్గా కురువలేదు. ఈ క్రమంలో ఈ ఏడాది మార్చి నుంచే ఎస్సారెస్పీ, మిడ్‌మానేరు, ఎల్‌ఎండీ, ఎల్లంపల్లి ప్రాజెక్టుల్లో నీటినిల్వలు తగ్గాయి. దీంతో గత ఆరు నెలలుగా వరదకాల్వ నీరు లేక వెలవెలబోతోంది. రైతులు వేసిన యాసంగి పంటలకు చివరిలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చొరవ తీసుకోవడంతో నీరు విడుదల చేశారు. ఆ సమయంలో రైతులు హర్షం వ్యక్తం చేశారు. అయితే ప్రస్తుతం ఈ సీజన్‌లో పంటల సాగు ఎలా అని రైతులు ఆందోళన చెందుతున్నారు.

**ఎస్సారెస్పీ, ఎల్లంపల్లిపైనే ఆశలు**

మేడిగడ్డ బ్యారేజీ మరమ్మతు పనులు కొనసాగుతుండడంతో ఇప్పట్లో కాళేశ్వరం జలాలు వరదకాల్వకు అందే సూచనలు కనిపించడం లేదు. ప్రస్తుతం ఎస్సారెస్పీలో 8 టీఎంసీలు, ఎల్లంపల్లి ప్రాజెక్టులో సైతం నీటినిల్వలు ఎక్కువగా లేవు. ఎస్సారెస్పీ పూర్తి సామర్థ్యం 90 టీఎంసీలు. కాగా వర్షాలు బాగా కురిసి 40 టీఎంసీల మేర నీరు నిల్వ ఉంటే ప్రాజెక్టు నుంచి నీరు విడుదల చేసే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. వర్షాలతో ఎల్లంపల్లిలో నీరు చేరినా లిఫ్ట్‌ చేసి వరదకాల్వకు విడుదల చేసే అవకాశం ఉంది.

**నాలుగు ఎకరాల్లో పత్తి వేసిన**



మిడ్‌మానేరులో నా భూమి ముంపునకు గురైంది. కొన్నేళ్లుగా జగ్గారావుపల్లిలో నాలుగు ఎకరాల మేర భూమి కౌలుకు తీసుకుని పత్తి పంట వేస్తున్న. వరదకాల్వ నుంచి చేనులకు పైప్‌లైన్‌ ఉంది. రెండు రోజుల కింద పత్తి విత్తనాలు నాటిన. వరద కాల్వలో నీరు ఉంటేనే పత్తి పంట పండే అవకాశం ఉంది.

– సింగిరెడ్డి బాలమల్లు, నీలోజిపల్లి, కౌలు రైతు

**కూరగాయలు పెట్టిన**



వరదకాల్వలో నీరు లేకనే ఈ సీజన్‌లో వరికి బదులు కూరగాయలు పెట్టిన. వరదకాల్వలో కొంచమే నీరు ఉంది. గత యాసంగిలో నీరు లేక కూరగాయల పంటలు ఎండిపోయాయి. వానాకాలం పంటలకైనా నీరు విడుదల చేయాలి.

– పెంద్యాల మహిపాల్‌రెడ్డి, దేశాయిపల్లి